వామ్మో.. జూన్

- పేద, మధ్యతరగతి కుటుంబాల్లో గుబులు
- భయపడుతున్న విద్యా సంవత్సరం
- తల్లిదండ్రులకు పెరిగిన ఖర్చు
- రైతులైతే అటు వ్యవసాయం పెట్టుబడులు, ఇటు విద్యా ఖర్చులు తడిచి మోపెడు



కలసపాడు : జూన్ నెల వచ్చిందంటే సామాన్యులకు దడ మొదలైనట్లే. స్కూళ్ల ప్రారంభం నేపథ్యంలో ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఇతర సామగ్రి కొనుగోళ్లతో తల్లిదండ్రులకు చుక్కలు కనపడతాయి. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఖర్చులు కలిపి తడిచి మోపెడవుతున్నాయి. ఏడాది అంతా దాచుకున్న సొమ్ము ఒక్క జూన్ నెలలోనే ఆవిరి కానుంది. గత జగనన్న ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. విద్యాభివృద్ధికి కృషి చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తల్లికి వందనం విధివిధానాలు ప్రకటించలేదు. దీంతో తల్లిదండ్రులు డబ్బులు లేకుంటే అప్పు తేవడం, అవసరాలకు అనుగుణంగా డబ్బు సమకూర్చుకునేందుకు ఆర్థిక స్థితిగతులపై అంచనాలు వేసుకుంటున్నారు. అటు కోటి ఆశలతో ఖరీఫ్‌కు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు భూములు పదునెక్కాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులను వైఎస్సార్ భరోసా ద్వారా రబీ, ఖరీఫ్‌లో ఆదుకున్నారు. అన్నదాత సుఖీభవ పథకంతో రైతులను ఆదుకుంటామని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ప్రగల్బాలు పలికారు. కూటమి ఏడాది పాలనలో రైతులకు చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదు. దీంతో సాగు పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఆదుకోకపోవడంతో అప్పులు చేసి రబీ నష్టాన్ని ఖరీఫ్‌లో పూడ్చుకుందామని సాగుకు ఉపక్రమిస్తున్నారు.

విద్యకు అధిక ఖర్చు

నర్సరీ మొదలుకుని డిగ్రీ ఆపై ఉన్నత స్థాయి చదువులు చదివే పిల్లలు ఉంటే ఆ కుటుంబానికి విద్యాపరమైన ఖర్చులు భారం కానున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతుంటే అడ్మిషన్ ఫీజు, ఏడాది ఫీజు, పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం, షూస్, ట్యూషన్ ఫీజు, లంచ్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు, బ్యాగ్‌లు, ట్రాన్స్‌పోర్టు చార్జీలు ఇలా ఖర్చు పెరిగిపోనున్నాయి. పాఠశాల, కళాశాల ఆధారంగా అంతే పెద్ద మొత్తం ఖర్చు చేయాల్సి వస్తోంది. వసతి గృహాల్లో ఉంటే హాస్టల్ ఫీజు అదనంగా భరించాల్సిందే. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులు సైతం నోట్ బుక్స్, స్టేషనరీ, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ట్రంక్ బాక్స్, డ్రెస్సులు, ఇతర ఖర్చులు ఉంటున్నాయి.

వ్యవసాయ ఖర్చులు ఇప్పుడే..

జూన్ నెల వచ్చిందంటే రైతులకు వ్యవసాయ పెట్టుబడులు భారం అవుతున్నాయి. రోహిణి కార్తె పూర్తి కావస్తూ మృగశిర రావడంతో రైతులు వ్యవసాయ పనులు చేపడుతున్నారు. తొలకరి వర్షాలు కురుస్తుండటంతో సాగుకు ఖర్చు చేయాల్సి వస్తోంది. పొలం దున్నడం, విత్తనాలు, ఎరువులు, కూలీలు, కౌలు రైతులు కౌలు చెల్లించడం లాంటి ఖర్చులు ఉంటాయి. అంతేగాకుండా వరినాట్లకు కూడా డబ్బులు అవసరం అవుతాయి. దీంతో రైతుల పెట్టుబడుల కోసం అప్పులు చేస్తున్నారు. దసరా, దీపావళి అంటే అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికి రానున్నాయి. అప్పటి వరకు రైతులు పెట్టుబడి ఖర్చులు చేయాల్సి వస్తోంది. అటు వ్యవసాయ ఖర్చులు, ఇటు పిల్లల చదువుల ఖర్చులు మోయలేని భారంగా మారాయి.

సాగుకు పెట్టుబడులు కావాలి



ప్రస్తుతం పంటల సాగుకు అనుకూలంగా వర్షాలు కురుస్తున్నాయి. వరి, కూరగాయల పంటలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నాం. విత్తనాలు, ఎరువులు కొనుగోలు, పొలం దున్నడానికి కూలీలకు రూ.2లక్షల వరకు పెట్టుబడి కావాల్సి వస్తోంది.

– పి.నారాయణరెడ్డి, రైతు, సిద్ధమూర్తిపల్లి, కలసపాడు మండలం

పిల్లల చదువుకు అప్పు



ప్రతి ఏడాది బడి తలుపులు తెరచుకుంటూ చాలా భయంగా ఉంటుంది. పిల్లలకు పుస్తకాలు, దుస్తులు, ఫీజులు తదితర ఖర్చులు ఏటా పెరిగిపోతున్నాయి. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేస్తున్నాం.

– బి.భాస్కర్‌రెడ్డి, మామిళ్లపల్లి, కలసపాడు మండలం

క్లుప్తంగా

విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపిక

చాపాడు : 2024–25 విద్యా సంవత్సరానికి పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదు మంది విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికై నట్లు మండల విద్యా శాఖాధికారి రవిశంకర్ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి చిలంకూరు అమృత(553), గాయిత్రి హైస్కూల్‌కు చెందిన మల్కిగారి సుభానా(546), కొప్పోలు పూజితా శ్రావణి(566), తిప్పలూరు విష్ణువర్ధన్‌రెడ్డి(565), అల్లాడుపల్లె విజేత హైస్కూల్‌కు చెందిన ఆదిమూలం ధరణి(563) చొప్పున ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 9న కడపలో రూ.20 వేల నగదు అందివ్వనున్నట్లు ఎంఈఓ తెలియజేశారు.

'సెయింట్ ఆంటోనీస్' సత్తా


ఎల్.కిరణ్‌కుమార్‌రెడ్డి


ఎన్.రక్షిత్ రెడ్డి


ఎం.మహిత


కె.రమ్య

కలసపాడు : స్థానిక సెయింట్ ఆంటోనీస్ పాఠశాల విదార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర రెడ్డి, హెచ్‌ఎం ప్రభావతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు పాఠశాలకు చెందిన ఎల్.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్.రక్షిత్ రెడ్డి, ఎం.మహిత, కె.రమ్య ఎంపికయ్యారని వారు వివరించారు. వీరికి ప్రభుత్వం రూ.20వేలు నగదు బహుమతులు, ప్రశంసాపత్రం, గోల్డ్‌మెడల్ అందిస్తుందని తెలిపారు. అవార్డులకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కంపచెట్లు తొలగింపు


జేసీబీతో కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

రాజుపాళెం : కేసీ చాపాడు కాలువ పరిధిలోని 15వ కిలోమీటరు నుంచి దాదాపు రెండున్నర కిలోమీటరు వరకు కంపచెట్లను ఎక్స్‌కవేటర్‌తో కంపచెట్లను తొలగించారు. అక్కడి లస్కర్ అబ్దుల్ రహిమాన్ సొంత ఖర్చులతో ఈ పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగించడంతో ఆదారిలో వెళ్లే వాహనదారులకు ఎంతో సౌకర్యంగా ఉంది. గతంలో ఆదారిలో వెళ్లాలంటే వాహనదారులతో పాటు రైతులు ఇబ్బందులు పడేవారు. దీన్ని గమనించిన లస్కర్ దారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించడంతో ఆదారిలో వెళ్లే వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్య భాగ్యం

కడప ఎడ్యుకేషన్: యోగ చేయడం ద్వారా ప్రతి ఒక్కరికి ఆరోగ్య భాగ్యం కలుగుతుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడప పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో యోగా అధ్యాపకుడు చంద్రమౌళి విద్యార్థులకు సూర్య నమస్కారాలను చేయించి యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగ ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

కోడి పందెం ఆటగాళ్లు అరెస్ట్

కమలాపురం : మండలంలోని గంగవరం గ్రామ సమీపంలోని పెన్నా నది పరివాహక ప్రాంతంలో శుక్రవారం కోడి పందాలు ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. కోడి పందాలు ఆడుతున్న సమాచారం రావడంతో సీఐ ఎస్‌కే రోషన్ పర్యవేక్షణలో ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశారు. కోడి పందాలు ఆడుతున్న 11 మందిని పట్టుకుని అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి 5 పందెం కోడి పుంజులను, రూ.20,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు. 11 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం

పెండ్లిమర్రి : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడి వాము దగ్ధమైన ఘటన మండలంలోని నల్లయ్యగారిపల్లె గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నల్లయ్యగారిపల్లె గ్రామానికి చెందిన రైతు శివరామిరెడ్డి పశువుల మేత కోసం ఇంటి సమీపంలో గడ్డి వామి ఏర్పాటు చేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చెరుకొని అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే పూర్తిగా కాలిపోయింది.

ఘనంగా మొదలైన గంగమ్మతల్లి జాతర


ప్రత్యేక అలంకరణలో దేవతా మూర్తులు

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడులో వెలసిన గంగమ్మతల్లి సన్నిధిలో శుక్రవారం నుంచి గంగా భవాని జాతర మహోత్సవ వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. ఉదయం 8 గంటలకు గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి, 9 గంటలకు బొల్లేవు గ్రామ ప్రవేశము, సాయంత్రం 4 గంటల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథిముగ్గు, జల్లిసానములు, పవావలి నిర్మించు కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శ్రీకృష్ణ జననం కంసవధ కథ నిర్వహించారు. 7న ఉదయం 8 గంటల నుంచి శిద్ధ భక్తియాగం, పొంగుపాలు యాగం, శమీవృక్ష యాగం, బొల్లేవుల యుద్ధం, గంగా కాటమరాజు కథ నిర్వహించనున్నారు. 8న సాయంత్రం 4గంటలకు పాలేటి యాగం, గ్రామస్తులు బోనాలు సమర్పించడం, ఆవుల పందారము ముట్టట, మద్దిమాను యాగం, 9న ఉదయం 10గంటలకు దీవెన బండారు ఇచ్చే కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

9న మండల సమావేశం

కాశినాయన : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 9న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మైథిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో తాగునీరు, రెవెన్యూ, వ్యవసాయశాఖ, ప్రాథమిక ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్య, విద్యుత్ తదితర శాఖలపై చర్చించనున్నామని ఆమె పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

ఫీజుల దోపిడీని అరికట్టండి

గోపవరం : అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు మీసాల రవి, ఓబులేసు, చెన్నయ్య, జకరయ మాట్లాడుతూ విద్యార్హత లేని టీచర్ల ద్వారా ప్రైవేటు పాఠశాలలలో విద్యార్థులకు విద్యనందిస్తూ వివిధ టెక్నోల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో సరైన వసతులు లేవని, వ్యాయామ ఉపాధ్యాయులు లేరని, విద్యార్థులు ఆట్లాడుకునేందుకు సరైన గ్రౌండ్స్ కూడా లేవని దీంతో విద్యార్థులు ఆటల పోటీలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలపై మొగ్గు చూపే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు.

బహుమతులు పంపిణీ



బహుమతులతో పోటీల్లో విజేతలైన విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం సమ్మర్ క్యాంప్‌లో హాజరైన విద్యార్థులకు పద్యపఠనం, చిత్రలేఖనం, జిరాఫీ చెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. చదువు గొప్పతనాన్ని వివరించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సమ్మర్ క్యాంప్‌లో సేవలు అందించిన డీకే చదువుల బాబు, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌సీపీఈ లైబ్రేరియన్ గంగాధర్‌రెడ్డి, జిరాఫీ చెస్ కోచ్‌లు నాగార్జున, అరవింద్, ప్రధానోపాధ్యాయుడు గుర్రప్పలకు గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది రెహ్మాన్ ఖాన్, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో అత్యాధునిక చికిత్సలు


ఆసుపత్రి ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : లక్ష్యా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ హరిత తెలిపారు. 12 ఏళ్లుగా పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తు వచ్చిన డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ హరిత తమ లక్ష్యా సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌ను నెహ్రూ రోడ్డులోని నూతన భవనంలోకి మార్చారు. నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ హరిత దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ లక్ష్యా సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌లో నగరాలకు ధీటుగా అత్యాధునిక వైద్య పరికరాలతో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు తమ హాస్పిటల్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారుమునిరెడ్డి, వైద్యులు వైవీ రామమునిరెడ్డి, నాగదస్తగిరిరెడ్డి, వరుణ్‌కుమార్‌రెడ్డి, మహేష్, వీరప్రసాద్‌రెడ్డి, ఆర్థో వైద్యుడు సుబ్బరాయుడు, వ్యాపార వేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి


మతాల పెద్దలతో మాట్లాడుతున్న సీఐ

పోరుమామిళ్ల : పట్టణంలో శనివారం బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి కోరారు. పట్టణంలోని హిందూ, ముస్లీం, క్రిష్టియన్ పెద్దలను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సమావేశం నిర్వహించారు. పోరుమామిళ్లలో అన్ని మతాలకు చెందిన పండుగలు శాంతియుతంగా, విజయవంతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని, బక్రీద్ కూడా అలాగే నిర్వహించుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నడచుకోవాలన్నారు.

కమనీయం... కల్యాణం

బి.కోడూరు : మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ అభయ రామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట, ధ్వజ కుంభాభిషేక కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు వేద పండితులు కనుమళ్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన శుక్రవారం ప్రాణప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమ అనంతరం శ్రీ సీతారామ కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఈ కల్యాణం తిలకించేందుకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఆయన సతీమణి తులశమ్మ విచ్చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వృషభాలచే బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. అనంతరం శ్రీ సీతారాముల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయ కర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు యస్.రామకృష్ణారెడ్డి, సుబ్బిరెడ్డి, రామిరెడ్డి, గురివిరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగంతో భూ సార క్షీణిత


లక్ష్మీపేటలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

చాపాడు : వ్యవసాయంలో అధిక రసాయన ఎరువుల వినియోగం వలన రోజు రోజుకు భూ సారం క్షీణిస్తోందని జాతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు తెలిపారు. వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం మండలంలోని చియ్యపాడు, రేపల్లె, గుంతచీపాడు, సోమాపురం, మొర్రాయిపల్లె, పిచ్చపాడు, అల్లాడుపల్లె, లక్ష్మీపేట, పెద్దగురువలూరు గ్రామాలలో రైతులతో చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ అధిక రసాయన ఎరువుల వాడకం వలన భూమిలో సారవంతం తగ్గిపోతుందన్నారు. చిరు ధాన్యాల రకాలు, సస్యరక్షణ చర్యలు, మైలైన యాజమాన్య పద్ధతులు, పోషక విలువ గురించి తెలియజేశారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త శ్రీవల్లి వరిలో అనువైన రకాలు, మినుము రకాల వాటి యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల అసిస్టెంటు ప్రొఫెసర్ విజయకుమార్ పశు పోషణ, టీకా మందులు, అధిక పాల దిగుబడి నిచ్చే పద్ధతులు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జాతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు బి.సుబ్బరాయుడు, జి.శ్యాంప్రసాద్, ఏపీ ఉమాకాంత్, మండల వ్యవసాయాధికారి ఇ.మ్యాగి శాస్త్రవేత్త ఫిరోజ్‌హుస్సేన్, మండల వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఘన నివాళి


వెంకట సుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని చెన్నంపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మిశెట్టి వెంకట సుబ్బయ్య (44) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ తదితరులు వెంకట సుబ్బయ్య మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వెంకట సుబ్బయ్య మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. పార్టీపరంగా ఆయన కుటుంబ సభ్యులకు అన్నిరకాలుగా అండగా ఉంటామని సూచించడంతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నక్రిష్ణారెడ్డి, కేశవరెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీని ఎప్పుడూ విమర్శించలేదు

మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా


ఆధారాలను చూపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణానికి సంబంధించి ప్రముఖ సంస్థ అయిన అంజుమన్ కమిటీని తాను ఎప్పుడు విమర్శించలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా తెలిపారు. నూతనంగా ఎన్నికై న అంజుమన్ కమిటీ అధ్యక్షుడు వీఎస్ ముక్తియార్, లాయర్ దాదాపీర్, ఇనయతుల్లా మినహా మిగతా సభ్యులందరికి తాను శుభాకాంక్షలు చెబుతున్నానన్నారు. వీరిపై పలు ఆరోపణలు ఉన్నాయన్నారు. తాను చేసిన విమర్శలపై సరైన సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు చేశారన్నారు. నిబంధనల ప్రకారం అంజుమన్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక జరగలేదని తెలిపారు. ఇస్లాంపురం మసీదులో ఎందుకు అనౌన్స్‌మెంట్ చేయలేదని, నిబంధనల ప్రకారం ఎన్నిక చేయలేదని ప్రశ్నించారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న వారు రాజకీయాల్లో ఉండకూడదని మొదటి నియమంలోనే ఉందని తెలిపారు. 2016లో అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్‌గా ఉన్న ముక్తియార్ వక్ఫ్‌బోర్డు సీఈఓ షోకాజు నోటీసు ఇవ్వగా కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నది వాస్తవమని ఆధారాలు చూపించారు. మోడంపల్లె మసీదుకు సంబంధించి సర్వే నంబర్ 565లోని 73 సెంట్ల స్థలాన్ని అమ్మడం జరిగిందని, అందులో ఐదు మంది పేర్లు ఉన్నాయన్నారు. విచారణ జరిపిన అనంతరం డీఎస్పీ లాయర్ దాదాపీర్ పేరును ఏ2గా కేసులో చేర్చారన్నారు. దీనిపై దాదాపీర్ క్వాష్ పిటీషన్ వేశారన్నారు. దస్తగిరిపేటలో అందరూ చందాలు వేసి కొనుగోలు చేసిన ఫరూఖియా ఎడ్యుకేషనల్ ఓరియంటల్ సొసైటీని ఇనయతుల్లా అమ్ముకున్నారని ప్రత్రాలను చూపించారు. ముక్తియార్ ప్రధాన అనుచరుడైన మండి అబ్దుల్ ఖాదర్ ఇందులో సాక్షి సంతకం చేశారని పేర్కొన్నారు

నీవు ఏమైనా దేవీ పుత్రుడివా..

తనపై వ్యక్తిగత విమర్శలు చేసిన ప్రస్తుతం అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ ముక్తియార్ దేవీ పుత్రుడా అని ఆయిల్ మిల్ ఖాజా ప్రశ్నించారు. కేవలం అధికార పార్టీ బలంతోనే ముక్తియార్ మళ్లీ రాజకీయాలను పూసి అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారన్నారు. ఆస్తులను అమ్ముకున్న వారు సరఫరజ్‌లుగా ఎలా కొనసాగుతారని ప్రశ్నించారు. సమావేశంలో చాంద్ బాషా, గైబుసా, హిద్రీస్, ఖదీర్ బాషా పాల్గొన్నారు.